సాక్షి శ్రీకాకుళం

శనివారం । 14 । సెప్టెంబర్ । 2024



మా బతుకులు ఏం కావాలి?

కొత్త మద్యం పాలసీ పాత కొలువులకు పాతర వేస్తోంది. దీనిపై ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. - 8లో



పల్లెలపై విష జ్వరాల పంజా

డొంకూరు, నందికొండ గ్రామాల్లో జ్వరాలు ప్రబలుతున్నాయి. నందికొండలో డెంగీ కేసు నమోదైంది. - 8లో

నేడు రాష్ట్రస్థాయి టెన్నీకాయిట్ పోటీలు ప్రారంభం

వజ్రపుకొత్తూరు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం నుంచి సోమవారం వరకు రాష్ట్రస్థాయి టెన్నీకాయిట్ పోటీలను నిర్వహించనున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు తారకేశ్వర్ పండా తెలిపారు. 36వ ఆంధ్రప్రదేశ్ అంతర్ జిల్లా బాలబాలికల విభాగంలో నిర్వహించనున్నామని, ఈ పోటీలకు కేంద్ర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు.

న్యూస్‌రీల్

కేరాసింగి గ్రామ సందర్శన



కేరాసింగి గ్రామంలో గిరిజనులతో మాట్లాడుతున్న ఆర్డీఓ సుదర్శన్ దొర

మెళియాపుట్టి : మండలంలోని ఎత్తైన గిరిశిఖర గ్రామమైన కేరాసింగి గిరిజన గ్రామాన్ని శుక్రవారం ఆర్డీఓ సుదర్శన దొర సందర్శించారు. షెడ్యూల్ తెగల జాతీయ కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్ శనివారం కేరాసింగి గ్రామాన్ని సందర్శించనున్న నేపథ్యంలో ముందస్తుగా ఆయన అక్కడకు వెళ్లి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ప్రజలంతా అందుబాటులో ఉండాలని సూచించారు. తమ సమస్యలు ఆయన దృష్టిలోకి తీసుకెళ్తామని స్థానికులు ఆర్డీఓకు తెలిపారు.

జాతీయ లోక్ అదాలత్‌కు సిద్ధం



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా

శ్రీకాకుళం పాతబస్టాండ్: జాతీయ లోక్ అదాలత్ శనివారం నిర్వహించనున్నామని, అదాలత్‌ను వినియోగించుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ అధ్యక్షుడు జునైద్ అహ్మద్ మౌలానా తెలిపారు. కోర్టు హాల్‌లో శుక్రవారం ఆయన మాట్లాడారు. జిల్లాలో మొత్తం 21 బెంచ్‌లు సిద్ధం చేశామని, జిల్లా మొత్తం మీద పెండింగ్‌లో ఉన్న సివిల్, క్రిమినల్ కేసులు 2751 గుర్తించామన్నారు. ప్రీ లిటిగేషన్ కేసులు 545 పరిష్కరిస్తామన్నారు.

స్కూల్ కాంప్లెక్స్‌ల పునర్విభజనపై అవగాహన

నరసన్నపేట: ప్రభుత్వ ఆదేశాల మేరకు విద్యాశాఖ సూచనలతో మన పాఠశాల-మన భవిష్యత్ కార్యక్రమంలో భాగంగా స్కూల్ కాంప్లెక్స్‌ల పునర్విభజన పూర్తి చేయాలని డీఈఓ తిరుమల చైతన్య అన్నారు. స్థానిక ఎంఈఓ కార్యాలయంలో నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమంలో ఆయన శుక్రవారం పాల్గొని ఈ పునర్‌విభజన ఆవశ్యకతను వివరించారు. ప్రైవేటు స్కూల్స్‌ను కూడా స్కూల్ కాంప్లెక్స్‌లో చేర్చాలని, ఒకే పంచాయతీలో ఉన్న స్కూల్స్ అన్నీ ఒకే కాంప్లెక్స్ పరిధిలో ఉండాలని సూచించారు. సమావేశంలో నరసన్నపేట ఎంఈఓలు దాలినాయుడు, శాంతారావులతో పాటు కోటబొమ్మాళి, సారవకోట, జలుమూరు, పోలాకి మండలాలకు చెందిన ఎంఈఓలు ఉపాధ్యాయులు ఉన్నారు.

వైఎస్సార్ సీపీ నేత కారుపై దాడి



దాడిలో పగిలిన వాహనం అద్దం

రణస్థలం: ఎచ్చెర్ల మండలం ఫరీదుపేటలో శుక్రవారం రాత్రి వినాయక ఊరేగింపు జరుగుతుండగా వైఎస్సార్ సీపీ జిల్లా సేవాదళ్ కార్యదర్శి, ఎచ్చెర్ల ఎంపీపీ మొదలవలస చిరంజీవి తమ్ముడు కృష్ణ కారుపై టీడీపీ నాయకులు రాయితో దాడి చేశారు. దీంతో కారు అద్దాలు పగిలిపోయాయి. గ్రామంలో ప్రస్తుతం కూన ప్రసాద్ అనే వైఎస్సార్ సీపీ కార్యకర్త హత్య నేపథ్యంలో పోలీస్ పికెట్ కొనసాగుతోంది. కారుపై దాడి ఘటన నేపథ్యంలో స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఘటనా స్థలానికి సీఐ అవతారం, ఎస్ఐ సందీప్‌కుమార్ గ్రామం చేరుకున్నారు. కారు యజమాని నుంచి ఫిర్యాదు స్వీకరించారు. వినాయక ఊరేగింపు మార్గాన్ని మళ్లించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. గ్రామంలో గొడవలు జరగకుండా పటిష్టమైన పికెట్ ఏర్పాటు చేశారు.

కౌన్సిలింగ్ ప్రక్రియలో కోరిన చోటకు బదిలీ

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లావ్యాప్తంగా ఉన్న మహిళా పోలీసులందరినీ ఒకే చోటకు చేర్చి కౌన్సిలింగ్ ప్రకియలో వారు కోరుకున్న స్థానానికే బదిలీ చేసేలా ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి చొరవ చూపారు. శుక్రవారం ఉదయం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.అప్పారావు, గ్రామ, వార్డు సచివాలయాల నోడల్ అధికారి పి.వాసుదేవరావులతో కలిసి ఎస్పీ కౌన్సిలింగ్ నిర్వహించారు. ప్రక్రియలో భాగంగా 238 మంది మహిళా పోలీసులు ఆన్‌లైన్‌లో బదిలీ కోసం దరఖాస్తు చేసుకోగా వీరిలో 18 మంది కౌన్సిలింగ్‌కు గైర్హాజరయ్యారు. 71 మందికి బదిలీలవ్వగా మరో 149 మంది యథావిధి స్థానాల్లో కొనసాగడానికి అంగీకారం తెలిపారు. తన ఎదురుగానే కూర్చోబెట్టుకుని ఖాళీగా ఉన్న సచివాలయ ఆప్షన్లను కంప్యూటర్ డిస్‌ప్లేలో చూపించి ఎంపిక చేసుకోవాలంటూ మహిళా పోలీసులకు సూచించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ కోటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.



మెడిసిన్ చదివించాలంటే కష్టమే

ప్రైవేటు మెడికల్ కాలేజీలను ప్రభుత్వం ప్రోత్సహిస్తూ.. ప్రభుత్వ మెడికల్ కాలేజీలకు మంగళం పాడుతున్నందున మెడిసిన్ చదివించాలంటే భయమేస్తోంది. ఈ పద్ధతి మాలాంటి వేలాది మందికి ఆర్థికంగా ఎంతో భారం కలిగిస్తుంది. - ఎల్.మల్లేశ్వరరావు, విద్యార్థి తండ్రి, శ్రీకాకుళం



ప్రభుత్వ నిర్ణయం మార్చుకోవాలి

ఈ ఏడాది నుంచి కడప, పాడేరు మెడికల్ కాలేజీల్లో ప్రభుత్వ పరంగా విద్యా బోధన జరుగుతుందని ఆశించిన విద్యార్థులకు నిరాశే మిగులుతుంది. మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని మార్చుకోవాలి. వేలాది మంది విద్యార్థులకు మంచి జరిగేలా మెడికల్ కాలేజీలను ప్రభుత్వ పరంగా నిర్వహించాలి. - పి.విష్ణుమూర్తి, విద్యార్థి తండ్రి, శ్రీకాకుళం



మన ఇసుక శ్రీకాకుళం టు విశాఖి



- ఉచిత ఇసుక విధానం అమలు కాకపోవడంతో బ్లాక్ మార్కెట్ దందా
- 18 టన్నుల లారీ ధర రూ. 40వేల నుంచి రూ. 50వేలు
- ఓ మంత్రి కనుసన్నల్లో విశాఖకు అక్రమంగా తరలిపోతున్న జిల్లా ఇసుక
- ఇద్దరు ప్రజాప్రతినిధుల సాయంతో దందా
- విశాఖలోని బిల్డర్ చేత బ్లాక్‌లో ఇసుక విక్రయాలు
- 2014-19 అక్రమాలు పునరావృతం

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: సిక్కోలు ఇసుక విశాఖకు తరలివెళ్లిపోతోంది. భవన నిర్మాణాలు ఎక్కువగా జరుగుతుండటంతో బ్లాక్ మార్కెట్ ద్వారా మన ఇసుకను తెగ అమ్మేసుకుంటున్నారు. అధికారిక ఇసుక స్టాక్ పాయింట్లు ఏర్పాటు చేయకపోవడంతో తెలుగు తమ్ముళ్లు నడుపుతున్న అనధికార ఇసుక ర్యాంపులపై ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో విశాఖలో లారీ ఇసుక ధర రూ.40వేల నుంచి రూ.50వేలు పలుకుతుండటంతో ఇక్కడ ఇసుకకు డిమాండ్ పెరిగిపోయింది. ఇదే అవకాశంగా తీసుకుని పచ్చనేతలు చెలరేగిపోతున్నారు. అధికారం అండతో నదీ తీర ప్రాంతాల్లో ఎక్కడికక్కడ తవ్వకాలు జరిపి విశాఖపట్నంకు రవాణా చేస్తున్నారు. అక్కడొక బిల్డర్ సాయంతో బ్లాక్‌లో ఇసుకను విక్రయిస్తున్నారు. ప్రస్తుతం రూ.కోట్లలో వ్యాపారం జరుగుతోంది. అడ్డగోలు వ్యాపారంపై ఓ మంత్రి గుత్తాధిపత్యం సాగిస్తున్నారు. కొందరు ప్రజాప్రతినిధులను పెట్టుకుని తమ దందా యథేచ్ఛగా కానిచ్చేస్తున్నారు.

విశాఖలో ఇసుకకు ఉన్న డిమాండ్‌ను అక్రమార్కులు క్యాష్ చేసుకుంటున్నారు. అధికారికంగా ఇసుక కొనడానికి ఎక్కడా అవకాశం లేకపోవడం టీడీపీ నాయకులకు వరంలా మారింది. జిల్లాలో ఎక్కడా ర్యాంపులకు అనుమతులు ఇవ్వలేదు, స్టాక్ పాయింట్లు ప్రారంభించలేదు. కానీ ప్రతి రోజూ వందలాది లారీలతో ఇసుక విశాఖపట్నం తదితర ప్రాంతాలకు తరలిపోతోంది. అక్కడక్కడ స్థానికులు ఫిర్యాదు చేయడం, అడ్డుకోవడంతో ఒకటో రెండో లారీలను పట్టుకుంటున్నారు. లేదంటే ఇసుక అక్రమ రవాణా దర్జాగా సాగిపోతోంది.

టీడీపీ అధికారంలో ఉన్న ప్రతి సారి ఇసుక మాఫియా చెలరేగిపోతుందనేది అందరికీ తెలిసిందే. 2014-19లో కూడా ఇదే రకంగా ఇసుక దందా సాగేది. బిగ్‌బాస్‌గా పేరు పొందిన ఓ మంత్రి కనుసన్నల్లోనే ఇసుక దోపిడీ జరిగేది. అప్పట్లో ఓ ఇద్దరు మంత్రులు జిల్లా ఇసుకను పెద్ద ఎత్తున మింగేశారు. వందల కోట్ల రూపాయలు ఆర్జించారు. విశాఖపట్నం కేంద్రంగానే ఇసుక బాగోతం నడిచేది. బిగ్‌బాస్‌గా పేరు పొందిన మంత్రికి విశాఖపట్నంలో ఒక బిల్డర్ అత్యంత సన్నిహితంగా ఉంటారు. ఇక్కడి నుంచి తరలించిన ఇసుక అక్కడ బిల్డర్ బ్లాక్‌లో విక్రయిస్తూ పెద్ద ఎత్తున సొమ్ము చేసుకున్నారు. మళ్లీ ఇప్పుడు అదే ట్రెండ్‌కు శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం ప్రభుత్వం ఎక్కడ అధికారికంగా ఇసుక ర్యాంపులు ఏర్పాటు చేయకపోవడం, కనీసం స్టాక్ పాయింట్లు ప్రారంభించకపోవడంతో తమకు అలవాటైన ఇసుక దందాకు తెరలేపారు. ఎప్పటిలాగే ఆ మంత్రే సూత్రధారిగా వ్యవహరించగా, తన చెప్పుచేతుల్లో ఉండే ఇద్దరు ప్రజాప్రతినిధులను పాత్రధారులుగా మార్చుకున్నారు. మంత్రి ఆదేశాల మేరకు విశాఖలోని బిల్డర్ ఆ ప్రజాప్రతినిధులను సంప్రదిస్తారు. చిత్తం ప్రభు.. అంటూ వెంటనే సదరు ప్రజాప్రతినిధులు ఇక్కడి నుంచి ఇసుకను పంపిస్తున్నారు. తన వద్దకు చేరిన ఇసుకను రూ. 40వేల నుంచి రూ. 50వేలకు ఆ బిల్డర్ విక్రయిస్తున్నారు. ఇటీవల వరదలొచ్చేవరకు జోరుగానే ఈ వ్యాపారం సాగేది. వర్షాలు పడటంతో గత కొన్ని రోజులు ఆగింది. వర్షాలు ఆగడంతో మళ్లీ దందా ప్రారంభమైంది.

డీసిల్టేషన్ పాయింట్లపైనే అనుమానాలు

ఇసుక అక్రమ దందాకు డీసిల్టేషన్ పాయింట్లు కూడా ఉపయోగపడుతున్నాయన్న ఆరోపణల నేపథ్యంలో జిల్లాకు సంబంధించి డీ సిల్టేషన్ పాయింట్లపై కూడా ఆరోపణలు, ఫిర్యాదులు వస్తున్నాయి. జిల్లాలో గార, కా ఖండ్యాంలో డీసిల్టేషన్ పాయింట్లకు అనుమతిచ్చారు. అందులో కాఖండ్యాంలో ప్రారంభం కాగా, గార పాయింట్ ఇంకా ప్రారంభం కాలేదు. నదిని విస్తరించకుండా, లోతుగా తవ్వకుండా, దాని సహజ స్వభావం దెబ్బతినకుండా, నదీ స్వరూపాన్ని పునరుద్ధరించేందుకని ఇసుక మేటలను తొలగించే కార్యక్రమం చేపడతారు. ఆ తొలగింపు ప్రక్రియను కాంట్రాక్టర్లకు అప్పగిస్తోంది. అలా తవ్విన ఇసుకను సమీపంలోని స్టాక్ పాయింట్‌కు తరలించి, విక్రయించాలన్నది డీసిల్టేషన్ విధానం ముఖ్య ఉద్దేశం. కానీ, ప్రస్తుతం ప్రారంభమైన కాఖండ్యాంలో డీసిల్టేషన్ పాయింట్‌లో అడ్డగోలుగా పని జరుగుతోంది. రాత్రి పగలు అని తేడా లేకుండా తవ్వకాలు సాగించి ఇసుకను భారీ వాహనాలతో తరలిస్తున్నారు. వాస్తవంగా పగలే తవ్వకాలు జరపాలి. నేరుగా తవ్వకాలు జరిగిన చోటుకే వాహనాలను రప్పించి లోడింగ్ చేస్తున్నారు. అంతేకాకుండా అనుమతిచ్చిన వాహనాల ద్వారానే ఇసుకను రవాణా చేయాల్సి ఉన్నప్పటికీ అనుమతి లేని వాహనాలు సైతం ఇక్కడికొచ్చి ఇసుకను రవాణా చేస్తున్నారు. ఇదంతా నిబంధనలకు విరుద్ధం. కానీ, అధికార పెద్దల జోక్యంతో నడిచిపోతోంది. ఇటీవల ఒకాయన ఇక్కడ జరుగుతున్న బాగోతంపై గ్రీవెన్స్‌సెల్‌లో ఫిర్యాదు కూడా చేశారంటే అక్కడే స్థాయిలో ఇసుక దందా జరుగుతుందో అర్థం చేసుకోవచ్చు. వర్షాలు పడటంతో ఇటీవల తవ్వకాలు ఆగాయి. మళ్లీ ఇప్పుడు యథావిధిగా సాగుతున్నాయి. విశేషమేమిటంటే అనుమతిచ్చిన డీసిల్టేషన్ పాయింట్లలో ఒకటి జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధికి కాంట్రాక్ట్‌గా అప్పగించగా, మరొకటి విజయవాడకు చెందిన కాంట్రాక్టర్‌కు అప్పగించినట్టుగా తెలుస్తోంది. కానీ, ఇక్కడ తవ్వితీసిన ఇసుకను మాత్రం విశాఖపట్నంకే తరలిస్తున్నారు. ఈ డీసిల్టేషన్ పాయింట్ ముసుగులో పక్కనున్న నదీ తీర ప్రాంతాల్లో ఇసుకను తవ్వేసి, అక్రమంగా రవాణా చేసి, విశాఖలో విక్రయిస్తున్నారు. ఇదంతా విశాఖలోని ఓ బిల్డర్ సాయంతోనే జరుగుతోంది.

శ్రీకాకుళం పరిసరాల్లోనే..



ముఖ్యంగా శ్రీకాకుళం రూరల్, పాతపట్నం నియోజకవర్గం ఇసుకపైనే ఆ మంత్రి, బిల్డర్ కన్నేశారు. ఈ రెండు ప్రాంతాల నుంచైతే ఇసుకను తరలించడం చాలా సులువని, అడ్డంకులుండవన్న ఆలోచనతో తమ ప్లాన్ అమలు చేశారు. ప్రతి రోజూ వందలాది లారీలతో ఇక్కడి ఇసుకను విశాఖకు తరలిస్తున్నారు. స్థానికులు జోక్యం చేసుకుని అడ్డు తగిలినా, ఫిర్యాదు చేసినా అధికారులు పట్టుకుంటున్నారు. లేదంటే గుట్టు చప్పుడు కాకుండా విశాఖకు రవాణా చేసేస్తున్నారు. పగలు చేస్తే ఇబ్బందులు వస్తాయని అక్రమ రవాణా అంతా రాత్రిపూటే సాగిస్తున్నారు. భవిష్యత్‌లో ప్రభుత్వం అధికారికంగా ఇసుక స్టాక్ పాయింట్లు ఏర్పాటు చేసినప్పటికీ తమ దందా ఆగిపోకుండా ప్లాన్ చేసుకుంటున్నారు. ప్రభుత్వం ఓపెన్ చేసే ర్యాంపుల ముసుగులో చుట్టు పక్కల ఉన్న నదీ తీర గ్రామాల్లో ఇసుక దోపిడీ చేయాలని చూస్తున్నారు. అందుకు తగ్గట్టుగా తమకు కావల్సిన అధికారులను మోహరిస్తున్నారు. చెప్పినట్టుగా పని చేసే నిఘా అధికారులకే ఇక్కడ పోస్టింగ్‌లిచ్చారు. ఇస్తూనే ఉన్నారు.

అదనపు ఎస్పీ బాధ్యతల స్వీకరణ

శ్రీకాకుళం క్రైమ్: జిల్లా అదనపు ఎస్పీ (క్రైమ్)గా పి.శ్రీనివాసరావు శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఎస్పీ క్యాంపు కార్యాలయంలో ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఆయన ప్రస్తుతం కాశీబుగ్గ సబ్ డివిజన్ డీఎస్పీగా పనిచేస్తూ పదోన్నతిపై ఈ పోస్టులో చేరారు.

మెప్మా పీడీగా ఎస్వీ రమణ



శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): శ్రీకాకుళం జిల్లా మెప్మా పీడీగా ఎస్వీ రమణను నియమించారు. అదే శాఖలో ఏఓగా విధులు నిర్వహిస్తున్న ఈయనకు పీడీగా బాధ్యతలు అప్పగించారు. ఈయన శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇదివరకు పీడీగా పనిచేసిన కిరణ్‌కుమార్‌ను బదిలీచేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

జెడ్పీ సీఈఓగా వెంకట్రామన్



అరసవల్లి: జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈఓ)గా ఆర్.వెంకట్రామన్‌ను పూర్తి అదనపు బాధ్యతలతో నియమిస్తూ పంచాయతీరాజ్ కమిషనరేట్ నుంచి శుక్రవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ప్రస్తుతానికి జెడ్పీ డిప్యూటీ సీఈఓగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఈయన గతంలో కొంతకాలం సీఈఓగా పనిచేశారు. ఇప్పటివరకు సీఈఓగా పనిచేసిన డి.వెంకటేశ్వరరావుకు బదిలీ కావడంతో మళ్లీ సీఈఓగా వెంకట్రామన్‌కు బాధ్యతలు అప్పగించారు. ఇదిలావుంటే ప్రస్తుతానికి జిల్లా పంచాయతీ అధికారిగా కూడా వెంకట్రామన్ ఎఫ్ఏసీ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

డ్రగ్స్ రహిత జిల్లాగా మారుద్దాం: కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: డ్రగ్స్, గంజాయి రహిత జిల్లాగా శ్రీకాకుళాన్ని మార్చేందుకు ప్రజలంతా ముందుకురావాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పిలుపునిచ్చారు. కలెక్టర్ కార్యాలయంలో జిల్లా స్థాయి నార్కో కోఆర్డినేషన్ సెంటర్ కమిటీ సమావేశంలో ఎస్పీ కేవీ మహేశ్వర్ రెడ్డితో కలిసి ఆయన మాట్లాడారు. కలెక్టర్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగం, వాటికి సంబంధించిన ఫిర్యాదుల నమోదు, అలాగే డి-అడిక్షన్ కేంద్రాల సేవలకి టోల్ ఫ్రీ నంబర్14446 పని చేస్తోందని పేర్కొన్నారు. రిమ్స్ ఆస్పత్రిలో డి-అడిక్షన్ సెంటర్‌ను కూడా పూర్తిస్థాయిలో నిర్వహిస్తామన్నారు. గంజాయి విక్రయాలు, వినియోగం జరగకుండా కఠిన చర్యలు తీసుకున్నట్లు ఎస్పీ కేవీ మహేశ్వర్ రెడ్డి చెప్పారు. ఈ ఏడాది గంజాయి విక్రయిస్తున్న 50 మందిపై సస్పెక్ట్ షీట్, ఏడుగురిపై రౌడీ షీట్ తెరిచామన్నారు.

మా హయాంలోనే పలాస స్థాయి పెరిగింది

- మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు



కాశీబుగ్గ పోలీసు స్టేషన్ వద్ద మాట్లాడుతున్న మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు

కాశీబుగ్గ: వైఎస్ జగన్ సీఎంగా, తాను మంత్రిగా ఉన్న సమయంలోనే పలాస స్థాయిని పెంచామని మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. శుక్రవారం కాశీబుగ్గలో ఎస్పీ గ్రీవెన్స్‌సెల్‌కు హాజరై ఎస్పీ మహేశ్వరరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. పలాస మండలం బొడ్డపాడు గ్రామంలో ఓ ఇంటిపైకి రౌడీల్లా తెలుగుదేశం నాయకులు దాడులకు ఎగబడ్డారని ఫిర్యాదు చేసినా ఎలాంటి కేసులు నమోదు చేయలేదని తెలిపారు. పలాసను రెవెన్యూ డివిజన్‌గా మార్చడంతో పలాస స్థాయి, రూపురేఖలు మారిపోయాయని అన్నారు. ఇప్పుడు ఎస్పీ గ్రీవెన్స్, కలెక్టర్ విజిట్‌లు, ఆర్డీఓ పర్యవేక్షణలు జరుగుతున్నాయని సంతోషం వ్యక్తం చేశారు. పెద్ద పెద్ద సంస్థలు పలాసకు వస్తున్నాయని, అది తమ హయాంలోనే జరిగిందని గర్వంగా చెప్పుకుంటున్నామని అన్నారు. విజయవాడ వరదల విషయంలో ఎందుకు వరదలు వచ్చాయో చెప్పకుండా బోట్లు ఎవరివంటూ కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. కేవలం మూడు నెలల్లో ప్రజలకు చంద్రబాబు ప్రభుత్వంపై విరక్తి పుట్టిందని అన్నారు. బటన్ నొక్కడం ఏమిటని ప్రశ్నించిన బాబు ఇప్పుడు ఎందుకు బటన్ నొక్కలేకపోతున్నాడని ప్రశ్నించారు. కోవిడ్ సమయంలో చంద్రబాబు ఉండి ఉంటే ఎన్ని కోట్లు దండుకునేవారో అంటూ ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో 750 మంది విద్యార్థులకు మెడికల్ సీట్లు అందకుండా చేశారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మెడికల్ కళాశాలలను ప్రైవేటుపరం చేస్తే అందరం కలిసి నిరసన కార్యక్రమం చేపడతామన్నారు. 2029లో వైఎస్ జగన్ సీఎం అయిన వెంటనే పీపీపీ పద్ధతిని రద్దు చేస్తామన్నారు. చంద్రబాబు ఆయన హయాంలో ఒక్క ప్రభుత్వ మెడికల్ కళాశాల నిర్మించడం గానీ ప్రారంభించడం గానీ చేయలేదన్నారు.

వైఎస్సార్ హయాంలో శ్రీకాకుళానికి రిమ్స్ వచ్చిందని గుర్తు చేశారు. ఆ తర్వాత మళ్లీ వైఎస్ జగన్ 17 మెడికల్ కళాశాలలు తీసుకువచ్చారని అందులో 5 గ్రౌండింగ్ పూర్తి చేసుకున్నాయని, వందల మందికి మెడికల్ సీట్లు వస్తుంటే వాటిని ప్రైవేటు పరం చేయడం దారుణమన్నారు.



ఉమెన్స్ కాలేజీ పరిసర ప్రాంతాలను శుక్రవారం రాత్రి సందర్శించిన డీఎస్పీ వివేకానంద

మాస్టర్ ప్లాన్ రూపొందిస్తాం

- 'సాక్షి' కథనానికి స్పందించిన పోలీసులు

సాక్షి ఎఫెక్ట్...

శ్రీకాకుళం క్రైమ్ : 'సాక్షి' పత్రికలో శుక్రవారం ప్రచురితమైన 'డేంజర్ జోన్' కథనానికి ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి స్పందించారు. ఆ ప్రాంతంలోనే కాక నగరంలో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ట్రాఫిక్‌పై సంబంధిత మున్సిపాలిటీ, చీఫ్ సిటీ ప్లానింగ్ విభాగాలతో కలిసి మాస్టర్ ప్లాన్ సిద్ధం చేయాలని తమకు స్పష్టమైన ఆదేశాలిచ్చినట్లు డీఎస్పీ సీహెచ్ వివేకానంద పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన శుక్రవారం రాత్రి నగరంలోని ఉమెన్స్ కాలేజీ రోడ్డును ట్రాఫిక్ పోలీసులతో కలిసి పరిశీలించారు. ఉమెన్స్ కాలేజీ రహదారి మార్గం బ్లైండ్ టర్న్‌గా ఉందని.. దీంతో అకస్మాత్తుగా ముందుకు వచ్చేటప్పుడు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. స్పీడ్ బ్రేకర్లు ఆ ప్రాంతంలో వేస్తామని, కచ్చితంగా ట్రాఫిక్ ఐలాన్ ఏర్పాటు చేసి ట్రాఫిక్ కానిస్టేబుల్ ప్రతి రోజూ విధుల్లో ఉండేలా చూస్తామన్నారు. ఎక్కడెక్కడ డైవర్షన్, స్టాపర్స్, స్పీడ్ బ్రేకర్స్, ట్రాఫిక్ ఐలాన్ అవసరమవుతాయన్న దానిపై పదిరోజుల్లో కంఫర్టబుల్ మాస్టర్ ప్లాన్ సిద్ధం చేయనున్నట్లు చెప్పారు.

ముందస్తు చర్యల్లో ప్రభుత్వం విఫలం

- వరద ముంపు ప్రాంతాల బాధితులను ఆదుకోవాలి
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్



పార్టీ ముఖ్య నేతలతో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్

ఇచ్ఛాపురం: వరదలు వస్తున్నాయని తెలిసినా ముందస్తు చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ విమర్శించారు. వరద బాధితులందరినీ ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఆయన ఇచ్ఛాపురంలో శుక్రవారం ఓ కార్యక్రమానికి హాజరై నియోజకవర్గ నేతలతో సమావేశమయ్యారు. జిల్లాలో కురిసిన భారీవర్షాల కారణంగా లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయని, వీరిని ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని అన్నారు. చాలా చోట్ల పంట పొలాల్లో వేసిన వరి పంటలు కుళ్లిపోయాయని తెలిపారు. రైతులను ఆదుకోకుంటే ఆందోళనలు చేపడతామని పేర్కొన్నారు. ముందస్తు చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, ఇప్పటి వరకు విజయవాడకి చెందిన ప్రజలు నానా అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు. హామీల అమలులో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, ప్రజలే తిరగబడే సమయం ముందుందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ నర్తు రామారావు, మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు, పేరాడ తిలక్, మున్సిపల్ చైర్‌పర్సన్లు పిలక రాజలక్ష్మి పాల్గొన్నారు.

ఆ గుండెకు అండ కావాలి

- గుండె సమస్యతో బాధ పడుతున్న 9వ తరగతి బాలుడు
- అప్పులు చేసి చికిత్స చేయిస్తున్న తల్లిదండ్రులు
- స్థోమతకు మించిన పని కావడంతో దాతల సాయం కోసం ఎదురు చూపు



మా బాబుకు ప్రాణభిక్ష పెట్టండి అంటూ విన్నవించుకుంటున్న తల్లిదండ్రులు



మంచానికే పరిమితమైన లిఖిత్ వెంకటరామరాజు

జి.సిగడాం : వారిది వ్యవసాయం కుటుంబం. పొలం, పంట అని కాలం గడపాల్సిన ఆ కుటుంబ సభ్యులు ఆస్పత్రి, చికిత్స అంటూ ఆందోళన చెందుతున్నారు. ఈ ఇంటి పిల్లాడికి నాలుగేళ్ల వయసులో గుండె సమస్య వస్తే హైదరాబాద్ వరకు వెళ్లి ఆపరేషన్ చేయించారు. అప్పటి నుంచి బాబు అందరిలాగానే చక్కగా ఎదిగాడు. మూడు నెలల కిందటి నుంచి మళ్లీ సమస్య మొదలైంది. ఆస్పత్రులకు తీసుకెళ్లే గుండెకు సమస్య వచ్చిందని తెలిసింది. దీనికి తోడు చెవికీ ఆపరేషన్ చేయాలని డాక్టర్లు చెప్పారు. ఈ చికిత్స కోసం రూ.20 లక్షలకుపైనే అవుతుందని తెలియడంతో ఆ తల్లిదండ్రులు తల్లడిల్లిపోతున్నారు. పూర్తి వివరాల్లోకి వెళితే..

మండల పరిధిలోని పున్నాం పంచాయతీ ఉల్లివలస (నాయుడు వలస) గ్రామానికి చెందిన కాకర్లపూడి లఖిత్‌వెంకటరామరాజు గుండె వ్యాధితో బాధపడుతున్నాడు. బాలుడి తల్లిదండ్రులు రామకృష్ణంరాజు, శైలజ వ్యవసాయ పనులు చేస్తుంటారు. లిఖిత్‌కు నాలుగేళ్ల వయసు ఉన్నప్పుడు నిత్యం జ్వరం, కడుపు నొప్పి వస్తుండడంతో అప్పట్లో టెస్టులు చేయించి హైదరాబాద్‌లో నారాయణ హృదయ ఆస్పత్రిలో గుండె చికిత్స చేశారు. అప్పటి నుంచి లిఖిత్ బాగానే చదువుకుంటూ ఉండేవాడు. ఇప్పుడు 9వ తరగతికి వచ్చాడు. అయితే మూడు నెలల కిందటి నుంచి లిఖిత్‌కు ఆరోగ్య సమస్యలు చుట్టుముట్టాయి. దీంతో తల్లిదండ్రులు హైదరాబాద్‌లోని రెయిన్‌బో ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ గుండె చికిత్స కోసం రూ.12 లక్షలు, చెవి చికిత్స కోసం రూ.12 లక్షలు ఖర్చవుతుందని వైద్యులు చెప్పడంతో వీరిగుండెల్లో రాయి పడింది. ఇప్పటికే పిల్లాడి వైద్యం కోసం రూ.13 లక్షల వరకు అప్పు చేశారు. ఇంక డబ్బులు ఎక్కడ నుంచి తీసుకురావాలో అర్థం కాక నరకయాతన అనుభవిస్తున్నారు.

దాతలు స్పందించి సాయం చేస్తే తమ బిడ్డ బతుకుతాడని ఆశ పడుతున్నారు.

సాయం చేయాలనుకునేవారు 96037 56999 నంబర్‌ను సంప్రదించాలని కోరుతున్నారు.

వ్యవసాయం చేసుకుంటూ కాపాడుకుంటున్నాం..

మాది రెక్కాడితే గానీ డొక్కాడని కుటుంబం. బాబును కాపాడుకునేందుకు నానా ఇబ్బందులు పడుతున్నాం. వ్యవసాయంలో చాలీచాలని డబ్బులతో జీవనం సాగించలేకపోతున్నాం. బతుకు బండి లాగడం కష్టంగా ఉంది. మంచంపై ఉండిపోయిన బాబునుచూస్తుంటే గుండె తరుక్కుపోతోంది. మా బాబుకు ఇంత పెద్ద కష్టం వచ్చింది. దాతలు, అధికారులు, ప్రభుత్వం ఆదుకోవాలి.

– కాకర్లపూడి శైలజ, విద్యార్థి తల్లి, నాయుడు వలస, జి.సిగడాం మండలం

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఏడుగురు ఎంపిక



స్కూల్ గేమ్స్ ఫుట్‌బాల్ పోటీలకు రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులు

నరసన్నపేట: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన ఏడుగురు విద్యార్థులు స్కూల్ గేమ్స్‌కు ఫుట్‌బాల్ విభాగంలో రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారని హెచ్‌ఎం వెంకటరావు తెలిపారు. అండర్–14లో బి.కమల్, బి.సాయి వరుణ్, కె.శ్రావణ్, కె.వంశీ, అండర్–17 కె.షణ్ముఖ, బి.దుర్గారావు, అండర్–19 విభాగంలో ఎం.షణ్ముఖరావులు ఎంపికయ్యారని తెలిపారు. శుక్రవారం శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఎంపికలు జరిగాయని తెలిపారు. వీరిని హెచ్‌ఎంతో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

విద్యుత్ లైన్‌మెన్‌కు పాముకాటు

జి.సిగడాం: మండల కేంద్రంలో విద్యుత్ లైన్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్న తలయారీ గాంధీరామ్ శుక్రవారం పాముకాటుకు గురయ్యాడు. ఇటీవల వానలకు ఎస్సీ కాలనీ సమీపంలో విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయని ప్రజలు సమాచారం ఇవ్వగా.. ఫోన్‌లో దారి తెలుసుకుంటూ స్తంభాల వద్దకు వెళ్లడానికి బయల్దేరాడు. నడుచుకుంటూ వెళ్తుండగా దారిలో పాము కాటు వేసి స్పృహ కోల్పోయాడు. ఫోన్‌లో సంభాషణ విన్న తోటి ఉద్యోగి, స్థానికులు వెంటనే అక్కడకు చేరుకుని హుటాహుటిన మండల కేంద్రంలో 24 గంటల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు. అక్కడ ప్రథమ చికిత్స అందించి శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న విద్యుత్ శాఖ ఏఈఈ జి.తిరుపతిరావు, వెంకయ్యపేట, జి.సిగడాం గ్రామస్తులు ఆస్పత్రికి చేరుకున్నారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి నిలకడగా ఉంది.

నా బిడ్డను విడుదల చేయండి



ఎస్పీ మహేశ్వరరెడ్డికి వినతిపత్రం అందిస్తున్న మాజీ మావోయిస్టు తల్లి కాములమ్మ

కాశీబుగ్గ: కాశీబుగ్గ పట్టణ పోలీసు స్టేషన్‌లో శ్రీకాకుళం ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి శుక్రవారం ఎస్పీ గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మందస మండలం నల్లబొడ్లూరు గ్రామానికి చెందిన లొంగిపోయిన మావోయిస్టు దున్న కేశవరావు అలియాస్ ఆజాద్‌ను విడుదల చేయాలని కోరుతూ ఆయన తల్లి ఎస్పీ మహేశ్వరరెడ్డికి వినతిపత్రం సమర్పించారు. పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష సహకారంతో మాజీ మావోయిస్టు తల్లి దున్న కాములమ్మ ఈ మేరకు విన్నవించారు. కేశవరావు 2011లో ప్రభుత్వానికి లొంగిపోయారని తెలిపారు. ఆయన లొంగుబాటు అనంతరం ఒడిశా పోలీసులు విచారణకు తీసుకెళ్తున్నామని చెప్పి తీసుకెళ్లి నేటి వరకు తిరిగి పంపించలేదని ఆజాద్ తల్లి దున్న కాములమ్మ వివరించారు. గతంలో ఎమ్మెల్యేగా పనిచేసిన గౌతు శ్యామసుందర శివాజీ ఈ విషయమై ఉన్నతాధికారులను కలిసినట్లు వెల్లడించారు. ఈ విషయమై ఎస్పీ మహేశ్వరరెడ్డి స్పందిస్తూ ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు.

పోలీసుల అదుపులో గంజాయి విక్రేతలు

ఆమదాలవలస: ఆమదాలవలస పట్టణంలో గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్న పది మందిని పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. పట్టణంలో రైల్వేస్టేషన్ సమీపంలో బీఆర్ నగర్‌లోని ఓ ఇంటిలో గంజాయిని నిల్వ చేసి విక్రయిస్తున్నట్లు తెలిసింది. దీనిపై ఎస్‌ఐ కె.వెంకటేష్‌ను సంప్రదించేందుకు ప్రయత్నించినా ఆయన అందుబాటులోకి రాలేదు.

మా బతుకులు ఏం కావాలి..?

- ఆందోళన వ్యక్తం చేస్తున్న మద్యం దుకాణాల సూపర్‌వైజర్లు, సేల్స్‌మెన్లు
- కూటమి ప్రభుత్వంలో కొలువులు కోల్పోతున్న పరిస్థితి
- ట్రక్కు యజమానులు, వాచ్‌మెన్ల ఉపాధి సైతం గల్లంతు



ఉద్యోగ భద్రత కల్పించాలంటూ ఫ్లెక్సీతో సూపర్‌వైజర్లు, సేల్స్‌మెన్

శ్రీకాకుళం క్రైమ్ : ప్రభుత్వ మద్యం దుకాణాల్లో ఔట్ సోర్సింగ్ పద్ధతిలో సేవలు అందిస్తున్న సేల్స్‌మెన్లు, సూపర్‌వైజర్ల కొలువులు కూలగొట్టేందుకు ప్రభుత్వం పథక రచన చేస్తోంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వీరికి ఉద్యోగాలు వచ్చాయి. గౌరవ ప్రదమైన వేతనాలు రావడంతో బతుకులు బాగుపడ్డాయని అంతా ఆనంద పడ్డారు. కానీ ప్రభుత్వం మారిన తర్వాత వీరి తలరాత కూడా మారిపోతోంది. వైఎస్సార్‌సీపీ హయాంలో వచ్చిన ఉద్యోగాలను తొలగించడమే పనిగా పెట్టుకున్న కొత్త ప్రభుత్వం వీరి బతుకులను కూడా టార్గెట్‌గా పెట్టుకుంది. సెబ్ (స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో విభాగం)ను మూడు రోజుల కిందట ప్రభుత్వం రద్దు చేసింది. సొంత శాఖైన ఎక్సైజ్‌కు ఆ సిబ్బంది బదిలీ కానున్నారు. అక్టోబరు 1 నుంచి కొత్త మద్యం పాలసీ అమలు కానుందని జీఓ ఇవ్వడం, ప్రైవేటు వ్యక్తులకే టెండర్ల ద్వారా దుకాణాలు అప్పగిస్తుండటం వరుసగా జరిగిపోతున్నాయి. దీంతో జిల్లాలోని 193 దుకాణాల్లో పనిచేస్తున్న సుమారు 743 మంది సేల్స్‌మెన్ (550), సూపర్‌వైజర్ల (193) ఆశలు అడియాసలయ్యాయి. తమ ఉద్యోగానికి భద్రత లేదంటూ వారంతా ఆందోళనకు సిద్ధమవుతున్నారు.

ఇప్పటికే జిల్లాలో మద్యం సరఫరా చేసే ట్రక్కుల యజమానులు తమ బిల్లులు చెల్లించలేదంటూ రోడ్డెక్కి నిరసనలు తెలిపారు. పాలకులు మాత్రం ఇవేమీ పట్టనట్టుగా తమ పని తాము కాని చేస్తున్నారు. నిరసనలు, బంద్‌లకు వస్తే చర్యలు తప్పవంటూనే వీరి స్థానంలో ఇప్పటికే ప్రత్యామ్నాయ ఏర్పాట్లతో సిద్ధంగా ఉన్నట్లు చర్చ జరుగుతోంది. ఈ దెబ్బతో సూపర్‌వైజర్లు, సేల్స్‌మెన్లు, 30 ట్రక్కు బళ్లయజమానులే కాక 300మంది వాచ్‌మెన్లు, హమాలీలు సైతం ఉపాధి కోల్పోతుండటం విశేషం.

సంకేతాలు రావడంతో..

కొత్త ప్రభుత్వం వచ్చీ రావడంతోనే ఎక్సైజ్ మంత్రి కొల్లు రవీంద్రను వీరంతా కలిసి తమ పరిస్థితిని వివరించారు. ఎక్సైజ్ డిపో మేనేజరుని కలిసి ఈ నెల 7న బంద్‌కు ఉపక్రమిస్తామని ముందుగా నోటీసులివ్వడంతో పై అధికారులకు ఆయన సమాచారం చేరవేశారు. రాష్ట్ర ఎక్సైజ్ కమిషనర్ నిషాంత్ కుమార్ సేల్స్‌మెన్, సూపర్‌వైజర్లు బంద్‌కు దిగితే దుకాణాలు నడిపేందుకు ఎలాంటి అంతరాయం లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని, ఇప్పటికే వారి స్థానాల్లో కొత్తవారిని నియమించడం జరిగిందని, కుదరకపోతే ఎక్సైజ్ సిబ్బందితోనైనా నడపండంటూ జిల్లా అధికారులకు అల్టిమేటం ఇచ్చారు. దీన్ని బట్టి చూస్తే.. సేల్స్‌మెన్, సూపర్‌వైజర్ల ఉద్యోగాల జీవితాలు మూన్నాళ్ల ముచ్చటగానే మిగిలిపోనుందని తెలుస్తోంది. ముఖ్యమంత్రి చంద్రబాబుకు బహిరంగ లేఖ రాయడం, ఈ నెల 14న అపాయింట్‌మెంట్ ఆయన ఇవ్వడం, మళ్లీ 15వ తేదీకి మారడాన్ని బట్టి చూస్తే అసలు కలుస్తారో.. లేదో అన్న అనుమానంతో ఉన్నారు. మరోవైపు ఉద్యోగ భద్రతపై ఏదైనా భరోసా ఇవ్వకపోతారా అన్న ఆశతో కూడా ఎదురు చూస్తున్నారు.

సీఎం మీద గౌరవంతో బంద్ ఆపాం..



సీఎం గారు ఈ నెల 14, 15 తేదీల్లో మాకు అపాయింట్‌మెంట్ ఇచ్చి చర్చలకు పిలిచారు. ఆయనమీద గౌరవంతో ఈనెల 7న చేద్దామనుకున్న బంద్‌ను ఆపాం. మెరిట్‌తో ప్రభుత్వ రిక్రూట్‌మెంట్‌లోనే ఎవరి రాజకీయ ప్రమేయం లేకుండా ఉద్యోగాలు సాధించాం. మాకు న్యాయం చేయాలి.

– బి.శ్రీను, స్టేట్ యూనియన్ మెంబర్, ఏపీ సేల్స్‌మెన్, సూపర్‌వైజర్ల సంఘం

ఉద్యోగ భద్రత కల్పించాలి..



పాలసీకి మేం వ్యతిరేకం కాదు. మాకు ఉద్యోగ భద్రత కల్పిస్తే చాలు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికికట్టుబడతాం. ప్రభుత్వ మద్యం దుకాణాలను ఒక్క ఏడాది విజయవంతంగా నడిపితే ఏటా ఒక నెల శాలరీ బోనస్‌గా ప్రకటించారు. అవి రావాల్సి ఉంది. ప్రభుత్వోద్యోగాలకు దరఖాస్తు చేసుకుంటే పదిశాతం రిజర్వేషన్ కల్పిస్తామన్నారు. – కీర్తి ధర్మారావు, అధ్యక్షుడు, జిల్లా సేల్స్‌మెన్, సూపర్‌వైజర్ల సంఘం

మా పరిస్థితి ఏం కాను..?

రాత్రి సమయాల్లో దొంగతనానికి వచ్చేవాళ్ల నుంచి చాలా రిస్క్ పడ్డాం. సుమారు 300 మంది ఉన్న మాకు మొదట్లో డైరెక్టుగా డిపో మేనేజర్ శాలరీ రూ. 13 వేలు ఇచ్చేవారు. ఇప్పుడు రూ. 10,600 ఏజెన్సీ తరఫున అందుతుంది. ఊరి దగ్గరలోనే పని ఉండటంతో మా జీవితం సాగిపోయేది. పాలసీ వస్తే మా గతేం కాను.

– గాడిలి అప్పయ్య, సెక్యూరిటీ (వాచ్‌మెన్)

కొత్త పాలసీ వస్తుంది..



అక్టోబరు 1 నుంచి కొత్త పాలసీ వస్తుంది. ఇప్పటికే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు సిద్ధం చేసుకున్నాం. ట్రక్కు యజమానులకు సంబంధిత ఏజెన్సీ బిల్లులిచ్చుకోవాలి. ఏజెన్సీల కాంట్రాక్టు ముగియడంతో సూపర్‌వైజర్లు, సేల్స్‌మెన్‌ల పెండింగ్ జీతాలు, బకాయిలు, వారి ఉద్యోగ భద్రత వంటి అంశాలపై ఉన్నతాధికారులకు నివేదించాం.

– బి.సుబ్బారావు, ఎక్సైజ్ సూపరింటెండెంట్, శ్రీకాకుళం

ప్రజా పోరాట యోధుడు సీతారాం ఏచూరి



నాగార్జున అగ్రికెం పరిశ్రమ వద్ద సీతారాం ఏచూరికి నివాళి అర్పిస్తున్న సీఐటీయూ నాయకులు

ఎచ్చెర్ల క్యాంపస్: ప్రజా పోరాటాలను నిర్మించడమే సీతారాం ఏచూరికి మనం అర్పించే నివాళి అని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు అన్నారు. ప్రముఖ పోరాట యోధుడు, సీపీఎం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, 12 ఏళ్ల పాటు రాజ్యసభ సభ్యుడిగా సేవలు అందించిన కామ్రేడ్ సీతారాం ఏచూరికి సీఐటీయూ జిల్లా కమిటీ ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తోందని అన్నారు. కామ్రేడ్ సీతారాం ఏచూరికి నివాళులర్పిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా సంతాప సభలు నిర్వహించాలని సీఐటీయూ ఇచ్చిన పిలుపులో భాగంగా శుక్రవారం చిలకపాలెం సమీపంలో గల నాగార్జున అగ్రికెం పరిశ్రమ వద్ద సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2011లో పైడిభీమవరంలో డాక్టర్ రెడ్డీస్ లేబరేటరీస్ కార్మికుల 100 రోజుల సమ్మె సందర్భంగా సీతారాం ఇక్కడకు వచ్చారని గుర్తు చేశారు. ప్రజాస్వామ్యం, సెక్యులరిజం పరిరక్షణకు జరిగిన పోరాట ఉద్యమాల్లో ఏచూరి పాత్ర అద్భుతమైనదని అన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు ఎల్.రామప్పడు, ఎం.రమణ, ఎ.సత్యనారాయణ, చిక్కాల సత్యనారాయణ, గణపతిరావు చిన్న, సుధాకర్, వరదరాజు తదితరులు ఉన్నారు.

గ్రావెల్ అక్రమ తరలింపుపై ఫిర్యాదు



అక్రమంగా ట్రాక్టర్ ద్వారా తరలిస్తున్న గ్రావెల్

సంతబొమ్మాళి: మండలంలోని గోవిందపురం పంచాయతీ పరిధిలో సర్వే నంబర్ 71లో ఉన్న గ్రావెల్ కొండ నుంచి అక్రమంగా కంకరను తరలించుకొని పోతున్నారని లీజుదారుడైన ఎం.నర్సింగరావు శుక్రవారం టెక్కలి మైన్స్ అధికారులకు ఫిర్యాదు చేశారు. జొన్నలపాడు గ్రామానికి చెందిన కొండల ముకుందరావు జేసీబీతో కొండను తవ్వి 12 టాక్టర్ల సాయంతో అక్రమంగా గ్రావెల్‌ను తరలించకపోతున్నారని, ఈ విషయమై అడిగితే దౌర్జన్యంగా కొట్టడానికి వస్తున్నారని అన్నారు. దీనిపై అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని లీజుదారుడు నర్సింగరావు కోరుతున్నారు.

కిడ్నీ వ్యాధికి యువకుడు బలి



కిడ్నీ వ్యాధితో మృతి చెందిన యువకుడు గురుమూర్తి

ఇచ్ఛాపురం రూరల్: వృద్ధాప్య దశకు చేరుకున్న తల్లిదండ్రులు, భార్య, ముగ్గురు పిల్లల్ని పోషించుకోవడానికి గల్ఫ్ వెళ్లిన యువకుడిని కిడ్నీ వ్యాధి కబళించింది. ఈదుపురం గ్రామానికి చెందిన దల్లి గురుమూర్తి(39) పొట్ట కూటి కోసం గత ఏడాది పోలెండ్ వెళ్లాడు. అక్కడే అనారోగ్యంగా ఉండడంతో నెల క్రితం స్వగ్రామానికి వచ్చి వైద్య పరీక్షలు నిర్వహిస్తే రెండు కిడ్నీలు పోయినట్లు వైద్యులు తెలిపారు. స్నేహితులు, తోటి కార్మికుల సహకారంతో విశాఖపట్నం ప్రైవేటు ఆస్పత్రిలో డయాలసిస్ చేయించుకుంటుండగా, శుక్రవారం తీవ్ర అస్వస్థతకు గురై ప్రాణాలు విడిచాడు. ఈయనకు తల్లిదండ్రులతో పాటు భార్య మాణిక్యం, కుమార్తెలు గీతా, శ్రావణి, కుమారుడు తేజ ఉన్నారు. కన్నకొడుకు తమ కళ్ల ముందే కన్నుమూయడంతో ఆ వృద్ధ తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.

పల్లెలపై విష జ్వరాల పంజా

ఇచ్ఛాపురం రూరల్: శివారు గ్రామమైన డొంకూరులో జ్వరాలు ప్రబలుతున్నాయి. ప్రస్తుతం గ్రామంలోని ప్రతి వీధిలో పది మంది వరకు జ్వర పీడితులు ఉండగా, అందులో చిన్నారులు అధికంగా ఉన్నారు. ఇదే గ్రామానికి చెందిన పొన్నగంటి సీతమ్మ అనే మహిళ విష జ్వరంతో బాధపడుతూ ఈనెల 4న మృతి చెందింది. ఇటీవల కురిసిన వర్షాలకు మురుగునీరు నిల్వ కావడంతో దోమలు స్వైర విహారం చేస్తున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానికంగా వైద్య సదుపాయాలు అంతగా లేకపోవడంతో సంచి వైద్యులను ఆశ్రయిస్తున్నారు. ఇప్పటికైనా వైద్య సిబ్బంది స్పందించి గ్రామంలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి రక్త పరీక్షలు నిర్వహించాల్సిందిగా స్థానికులు కోరుతున్నారు.

నందికొండలో డెంగీ కలకలం

సరుబుజ్జిలి: మండల కేంద్రానికి సమీపంలోని నందికొండ కాలనీ మంచం పట్టింది.

సుమారు 25 మంది విష జ్వరాలతో బాధపడుతుండగా, పెరుమాళ్ల అప్పారావు, చెల్లమ్మలు తీవ్ర జ్వరంతో స్థానిక ప్రాథమిక ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఎల్‌ఎన్‌పేట వసతి గృహంలో 8వ తరగతి చదువుతున్న నందికొండకాలనీకి చెందిన పట్నాన వేణుశ్రీ డెంగీ లక్షణాలతో శ్రీకాకుళం రిమ్స్‌లో చికిత్స పొందుతోంది. ఇటీవల బాలిక వసతి గృహంలో ఉన్నప్పుడు జ్వరం రావడంతో స్వగ్రామానికి వచ్చి స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రక్త పరీక్షలు చేయగా డెంగీ నిర్ధారించారని సిబ్బంది తెలిపారు. వెంటనే వైద్యాధికారి సంతోష్ కుమార్ స్పందించి తమ సిబ్బందితో కాలనీలో ఉన్న అందరి రక్తనమూనాలు పరీక్షించారు. స్థానికంగా ఏఎన్‌ఎం, హెల్త్ అసిస్టెంట్ పోస్టులు భర్తీ కాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు చెబుతున్నారు.

కాంగ్రెస్‌లో పరస్పర ఫిర్యాదులు

శ్రీకాకుళం: జిల్లా కాంగ్రెస్ పార్టీలో వివాదం చెలరేగి పరస్పరం పోలీసులకు ఫిర్యాదులు చేసుకున్నారు. డీసీసీ కార్యవర్గాన్ని మార్చడంపై తీవ్ర నిరసనలు వ్యక్తమవుతుండగా.. ఈ నెల 10వ తేదీన ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో షార్ట్ సర్క్యూట్ కారణంగా కొన్ని పరికరాలు కాలిపోయాయి. కొత్త డీసీసీ అధ్యక్షునిగా నియమితులైన అంబటి కృష్ణ ఈ విషయమై తనకు అనుమానాలు ఉన్నాయని గురువారం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా పార్టీ పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జి పేడాడ పరమేశ్వరరావు పేరును ప్రస్తావించారు. విషయం తెలుసుకున్న పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు శుక్రవారం పట్టణ డీఎస్పీ, ఒకటో పట్టణ సీఐలను కలిసి వినతి పత్రాలను అందజేశారు. తమపై కావాలనే తప్పుడు ఫిర్యాదులు చేస్తున్నారని ఆరోపించారు. ఆనంతరం డీసీసీ అధ్యక్షుడిని నిలదీయగా పీసీసీ అధ్యక్షురాలు షర్మిల ఆదేశాల మేరకు ఫిర్యాదు చేశానని, తనను క్షమించాలని కోరారు.

'పోలీసులు అన్యాయంగా కొట్టారు'

టెక్కలి/టెక్కలిరూరల్: పోలీసులు తనను అన్యాయంగా పోలీస్ స్టేషన్‌కు తీసుకువెళ్లి విచక్షణారహితంగా కొట్టారని ఆరోపిస్తూ టెక్కలికి చెందిన ఇల్లా గురుప్రసాద్ అనే యువకుడు శుక్రవారం టెక్కలి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స కోసం చేరాడు. బాధిత యువకుడు తెలిపిన వివరాలు ప్రకారం... ఓ వివాహితను వేధిస్తున్నానంటూ ఆ కుటుంబ సభ్యులు ఫిర్యాదు ఇచ్చారనే కారణంతో తరచూ పోలీస్‌స్టేషన్‌కు తీసుకువెళ్లి కొడుతున్నారని యువకుడు ఆవేదన వ్యక్తం చేశాడు. ఎప్పటిలాగే శుక్రవారం పోలీస్‌స్టేషన్‌కు తీసుకువెళ్లి ఇద్దరు పోలీసులు బూట్లతో తన్నారని, ఏమవుతుందోనని భయంతో పోలీస్‌స్టేషన్ నుంచి బయటకు పరుగులు తీశానని, ఈ లోగా తన తండ్రి చక్రపాణి చూసి ఆస్పత్రికి తీసుకువెళ్లారని యువకుడు తెలిపాడు. యువకుడు ఇచ్చిన వివరాలతో ఆస్పత్రి సిబ్బంది ఎంఎల్‌సీ నమోదు చేసి పోలీస్‌స్టేషన్‌కు పంపించారు. అయితే పోలీస్‌స్టేషన్‌లో తిరస్కరించినట్లు ఆస్పత్రి వర్గాలు చెబుతున్నాయి. దీనిపై టెక్కలి సీఐ విజయకుమార్ మాట్లాడుతూ టెక్కలికి చెందిన ఓ వివాహితను యువకుడు వేధిస్తున్నాడనే ఫిర్యాదు మేరకు స్టేషన్‌కు తీసుకువచ్చి విచారణ చేస్తుండగా బయటకు పరుగులు తీశాడని వెల్లడించారు. ఎంఎల్‌సీ విషయమై మాట్లాడుతూ పోలీస్‌స్టేషన్‌కు ఎంఎల్‌సీ వివరాలు తీసుకువచ్చే సమయానికి సిబ్బంది భోజనాలకు వెళ్లడంతో అందుబాటులో లేరు తప్ప తిరస్కరించలేదన్నారు.

ఏఎన్‌ఎం వర్సెస్ ఆశ వర్కర్లు

- టెక్కలి మండలంలో ఏఎన్‌ఎం, ఆశ వర్కర్ల మధ్య ముదురుతున్న వివాదం
- ఇటీవల ఓ ఏఎన్‌ఎం వేధించారనే కారణంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఆశ వర్కర్
- వైద్యారోగ్య శాఖ ఉన్నతాధికారులతో రాజీ ప్రయత్నాలు

టెక్కలి: మండలంలో ఏఎన్‌ఎం, ఆశ వర్కర్ల మధ్య వివాదం ముదురుతోంది. ఏఎన్‌ఎం మానసికంగా వేధించారనే కారణంతో ఇటీవల ఓ ఆశ వర్కర్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన ఈ వివాదానికి ఆజ్యం పోసింది. టెక్కలి గ్రామ సచివాలయం–3 కు చెందిన ఆశ వర్కర్ సనపల సరస్వతి ఈ నెల 9న ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఏఎన్‌ఎం హేమలత, ఎంఎల్‌హెచ్‌పీ కమల తదితర సిబ్బంది తనను మానసికంగా వేధింపులకు గురి చేయడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు ఆరోపిస్తూ ఫిర్యాదు చేశారు. దీంతో పీహెచ్‌సీ స్థాయి అధికారులు ఏఎన్‌ఎంకు మెమో ఇచ్చి వివరణ ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశారు. దీనిపై మిగిలిన ఏఎన్‌ఎంలు మండిపడుతూ తమకు ఉన్నతాధికారుల నుంచి వచ్చిన ఆదేశాల మేరకు దిగువ స్థాయి సిబ్బందికి విధులను కేటాయిస్తే ఇలాంటి చర్యలు ఏమిటని బాహాటంగా నిరసనకు దిగారు. భవిష్యత్‌లో ఉన్నతాధికారుల నుంచి వచ్చిన ఆదేశాలపై చేతులెత్తేస్తాం అనే సంకేతాలను వెలిబుచ్చారు. అయితే విధి నిర్వహణలో ఆశ వర్కర్‌పై ఏఎన్‌ఎంలు నోటికి ఇష్టం వచ్చినట్లుగా మాట్లాడుతూ మానసికంగా వేధింపులకు గురి చేస్తున్నారని, తక్షణమే ఆ ఏఎన్‌ఎంపై శాఖాపరంగా చర్యలు తీసుకుని భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలు జరగకుండా గట్టి చర్యలు తీసుకోవాలని సీఐటీయూ నాయకుల సహకారంతో గత కొద్ది రోజులుగా బాధిత ఆశ వర్కర్ తోటి ఆశ వర్కర్లు నిరసనకు దిగారు.

శుక్రవారం కె.కొత్తూరు పీహెచ్‌సీలో బాధిత ఆశ వర్కర్, ఆరోపణలు ఎదుర్కొంటున్న ఏఎన్‌ఎం, ఎంఎల్‌హెచ్‌పీ తో పాటు మిగిలిన ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లతో అడిషనల్ డీఎంహెచ్‌ఓ టి.శ్రీకాంత్, డీపీఎం వి.సురేష్, ఆశ నోడల్ అధికారి రవి, పీహెచ్‌సీ వైద్యులు గాయత్రీ, ఇంద్రజ, సీఐటీయూ నాయకులు హెచ్.ఈశ్వరరావు, కె.నాగమణి, మహాలక్ష్మి తదితరులతో సమావేశం నిర్వహించారు. ఒక్కొక్కరితో లిఖిత పూర్వకంగా అభిప్రాయాలను స్వీకరించారు.

నేటి నుంచి హిందీ పక్షోత్సవాలు

- 28వ తేదీ వరకు ప్రత్యేక కార్యక్రమాలు
- నేడు జాతీయ హిందీ దివస్



ఎచ్చెర్ల క్యాంపస్: హిందీ దివస్ సందర్భంగా కేశవ రెడ్డి స్కూల్ విద్యార్థుల విన్యాసం

శ్రీకాకుళం న్యూకాలనీ: హిందీ పక్షోత్సవాలకు వేళయ్యింది. జాతీయ హిందీ దివస్ సందర్భంగా శనివారం నుంచి పక్షోత్సవాలను నిర్వహించేందుకు సన్నద్ధమవుతున్నారు. ఈనెల 14 నుంచి 28 వరకు 15 రోజులపాటు ఉత్తరాంధ్ర ఉమ్మడి జిల్లాల్లో, ప్రతి జిల్లాలో ఐదు రోజుల పాటు హిందీ దివస్ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు మంచ్ ఉత్తరాంధ్ర సమన్వయకర్త కోనే శ్రీధర్, శ్రీకాకుళం జిల్లాశాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దొంతం పార్వతీశం, కనుగుల సత్యం, వర్కింగ్ ప్రెసిడెంట్ సూరంపల్లి బ్రహ్మాజీ చెబుతున్నారు. మరోపక్క హిందీ సులేఖన్ పోటీలను పోటీలను నిర్వహించి విద్యార్థులను ప్రోత్సహించారు. ప్రస్తుతం జిల్లాలో 454 మంది హిందీ ఉపాధ్యాయులుగా ప్రభుత్వ బడుల్లో పాఠాలు బోధిస్తున్నారు.

నేడు శ్రీకాకుళంలో శోభాయాత్ర

హిందీ దివస్‌ను పురస్కరించుకుని జిల్లాలో హిందీ ఫోరం ఆధ్వర్యంలో శనివారం పలు కార్యక్రమాలు పెద్ద ఎత్తున జరగనున్నాయి. నగరంలోని వైఎస్సార్ సర్కిల్ (ఏడు రోడ్ల జంక్షన్) నుంచి కేఆర్ స్టేడియం సమీపంలో ఉన్న అంబేడ్కర్ ఆడిటోరియం వరకు శోభాయాత్రను నిర్వహిస్తున్నారు. హిందీ భాషాభివృద్ధికి కృషిచేసిన వారిని ఘనంగా సత్కరించనున్నట్టు హిందీ ఫోరం జిల్లా కన్వీనర్ ఐ.సంతోష్‌కుమార్ తెలిపారు.

హిందీ పోస్టులను మంజూరు చేయాలి..



2024–25కి సంబంధించి ఎడీఎస్సీ నోటిఫికేషన్‌ను వెంటనే విడుదల చేయాలి. పీజీటీ హిందీ పోస్టులను మంజూరు చేయాలి. ప్రైవేటు స్కూళ్లలో నర్సరీ నుంచే హిందీ బోధన సాగుతోంది. ప్రభుత్వ స్కూళ్లలో కనీసం 2 లేదా 3వ క్లాసు నుంచైనా హిందీ బోధన మొదలుకావాలి.

– కోనే శ్రీధర్, ఉత్తరాంధ్ర సమన్వయకర్త, హిందీ మంచ్

నవజాత శిశువు మృతి

నరసన్నపేట: కోమర్తి బీసీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రం వద్ద మతిస్థిమితం లేని మహిళకి జన్మించిన నవజాత శిశువు శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రిలో శుక్రవారం మృతి చెందాడు. ఆదివారం రాత్రి జోరు వర్షంలో ప్రియాగ్రహారానికి చెందిన అప్పోజి అనే మహిళ మగబిడ్డను ప్రసవించిన విషయం విదితమే. సోమవారం నరసన్నపేట ఏరియా ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అనంతరం రిమ్స్‌కు తరలించారు. తక్కువ బరువు, నెలల నిండకుండానే మగ శిశువు పుట్టడంతో ఐసీయూలో ఉంచి చికిత్స అందించారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు శిశువు మృతి చెందినట్లు నరసన్నపేట ఎస్‌ఐ దుర్గాప్రసాద్ తెలిపారు. జిల్లా బాలల సంరక్షణ విభాగం కన్వీనర్ సీతారాం మాట్లాడుతూ తమకు సమాచారం వచ్చిందని, శిశువు తల్లి అప్పోజీని మదర్ థెరిసా ఆశ్రమంలో జాయిన్ చేశామన్నారు.

ఆవేదన..



శ్రీకాకుళం నుంచి ఆమదాలవలస వెళ్లే రోడ్డులో వాహనదారుల కష్టాలు నానాటికీ పెరుగుతున్నాయి. మొన్న కురిసిన వానలకు రోడ్డు గుంతల మయం కావడంతో భారీ వాహనాలు ఇరుక్కుపోయాయి. ఈ పరిస్థితి నుంచి తమను బయటపడేయాలని వాహనదారులు కోరుతున్నారు. – శ్రీకాకుళం రూరల్



కిలోమీటరు దూరంలో నిలిచిన ట్రాఫిక్ (ఇన్‌సెట్లో) పొక్లెయిన్‌తో వాహనాలను బయటకు లాగుతున్న దృశ్యం

గోతుల్లో కూరుకుపోయిన లారీలు